సాక్షి ఆదిలాబాద్

శనివారం । 16 । డిసెంబర్ । 2023



అందని 'ఉపాధి' కూలి

జిల్లాలోని ఉపాధిహామీ కూలీలకు మూడు నెలలుగా చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో వారు కుటుంబ పోషణకు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. 8లో▸



స్నేహితులకు అండగా..

ఆత్మీయ సమ్మేళనం పేరిట పూర్వవిద్యార్థులంతా చదివిన పాఠశాలలో కలుసుకుంటున్నారు. తోటి విద్యార్థులకు ఆపన్నహస్తం అందించి ఆదర్శంగా నిలుస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
28.0 /17.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రత పెరుగుతుంది. వేకువజామున పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న రాథోడ్ జనార్దన్, భక్తులు

ఇంద్రవెల్లి: మండలంలోని దనోరా బీ గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం ఖండోబ దేవుడి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో శోభాయాత్ర నిర్వహించగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్, ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరై పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సర్పంచ్ యేర్మ జాకేశ్వర్, నాయకులు దుర్గం శేఖర్, సంతోష్ మహరాజ్ తదితరులున్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న బృందం సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: అంకోలి పీహెచ్‌సీ పరిధి మావల మండలం వాఘాపూర్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఎన్‌క్వాస్ (నేషనల్ క్వాలిటీ అస్యురెన్స్ స్టాండర్డ్) ఢిల్లీ బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఆస్పత్రిలోని రికార్డులు, చార్ట్స్ పరిశీలించారు. క్వాలిటీ ఎసెస్మెంట్‌లో భాగంగానే ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించినట్లు వారు తెలిపారు. ఢిల్లీ బృందం సభ్యులు డాక్టర్ ప్రదీప్‌కుమార్ చౌదరి, డాక్టర్ సుబ్రజ్యోతిరావు వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, మండల వైద్యాధికారి డాక్టర్ సర్పరాజ్, ఎన్‌సీడీ అధికారి శ్రీధర్, హెల్త్ సూపర్‌వైజర్లు బొమ్మెత సుభాష్, ఆడె సురేశ్, వైద్య సిబ్బంది అమర్‌నాథ్, శ్రీనివాస్, రోజా, కృష్ణవేణి తదితరులున్నారు.

నూతన కార్యవర్గం

ఆదిలాబాద్‌రూరల్: హన్మకొండలో గురువారం నిర్వహించిన ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర కమిటీ సమావేశంలో జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర కమిటీలోకి తీసుకున్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గొడం గణేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జల్కే పాండురంగ్, ఉపాధ్యక్షులుగా జలపతిరావు, ఉయికె సంజీవ్, సహాయ కార్యదర్శులుగా గొడం రేణుక, కుమ్ర శ్యామ్‌రావు, ప్రధాన సలహాదారుగా కుర్సెంగే సూర్యభానును ఎన్నుకున్నారు.

జిల్లాస్థాయి యువజనోత్సవ తేదీలో మార్పు

కైలాస్‌నగర్: జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి యువజనోత్సవాలను ఈ నెల 22వ తేదీకి బదులు 21వ తేదీకి మార్పు చేసినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో యువజనోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9440843848 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

టెక్నికల్ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఆదిలాబాద్‌టౌన్: డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రైడరీ లోయర్, హయ్యర్ టెక్నికల్ పరీక్షలు ఫిబ్రవరిలో నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 29లోపు ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజుచెల్లించాలని పేర్కొన్నారు. పరీక్ష రాయాలనుకునే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డ్రాయింగ్ లోయర్ ఫీజు రూ.100, హయ్యర్ ఫీజు రూ.150, టైలరింగ్, ఎంబ్రైడరీ లోయర్ గ్రేడ్‌కు రూ.150, హయ్యర్ గ్రేడ్‌కు రూ.200 ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పన్ను బకాయిలు త్వరగా వసూలు చేయాలి

తాంసి: గ్రామాల్లో ఇంటి పన్ను బకాయిలను త్వరగా వసూలు చేయాలని డీపీవో శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రాన్ని సందర్శించి పన్ను వసూళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటిపన్ను బకాయిలు కూడా పూర్తిస్థాయిలో వసూలు చేయాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎక్కడా మురుగునీరు నిల్వకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీవో సుధీర్‌రెడ్డి, కారోబార్ సుభాష్ తదితరులున్నారు.

రిమ్స్‌లో ఆగని లొల్లి

- వైద్యవిద్యార్థుల తరగతుల బహిష్కరణ
- డైరెక్టర్ చాంబర్ ఎదుట బైఠాయింపు
- జైసింగ్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్
- డీఎంఈ ఆదేశంతో అధికారుల విచారణ



డైరెక్టర్‌ను తొలగించాలంటూ నిరసన తెలుపుతున్న వైద్యవిద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ మెడికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (రిమ్స్)లో వైద్య విద్యార్థుల ఆందోళన రెండోరోజూ కొనసాగింది. బుధవారం అర్ధరాత్రి వైద్య విద్యార్థులపై జరిగిన దాడికి బాధ్యుడిగా రిమ్స్ డైరెక్టర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని శుక్రవారం మెడికోలు, ఇంటర్న్‌షిప్ విద్యార్థులు డైరెక్టర్ చాంబర్ ఎదుట బైఠాయించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇంటర్న్‌షిప్ విద్యార్థులు విధులు బహిష్కరించగా, వీరికి మెడికోలు మద్దతుగా నిలిచారు. దీంతో రోగులు అసౌకర్యానికి గురయ్యారు. అత్యవసర సేవలు మినహా విధులు నిర్వహించేది లేదని జూడాలు స్పష్టం చేశారు. దాడి ఘటనకు సంబంధించి ఇప్పటికే రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రాంతికుమార్‌ను విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఈ దాడికి పాల్పడిన ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం అడిషనల్ కలెక్టర్ ద్వారా విచారణ జరిపించారు.

న్యాయం జరిగేదాకా ఆందోళన

దాడి ఘటనకు బాధ్యుడిని చేస్తూ రిమ్స్ డైరెక్టర్‌ను సస్పెండ్ చేసేదాకా ఆందోళన కొనసాగిస్తామని వైద్యవిద్యార్థులు స్పష్టం చేశారు. రిమ్స్‌లో తమకు సెక్యూరిటీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగినా పట్టించుకోలేదని వాపోయారు. ఆగస్టు 5న రీడింగ్ రూమ్‌లో తృతీయ సంవత్సరం విద్యార్థులు ఉండగా బయట వ్యక్తి గోడ పైపు ద్వారా ఎక్కేందుకు ప్రయత్నించాడని జూడాల సంఘం అధ్యక్షుడు అరుణ్ తెలిపారు. విద్యార్థినులు కేకలు వేయగా పైపు నుంచి కిందికి దిగి నగ్న ప్రదర్శన చేశాడని గుర్తు చేశారు. వసతిగృహంలోని విద్యార్థుల వస్తువులు, ఐప్యాడ్, కేటీఎం బైక్ కూడా చోరీకి గురైనట్లు తెలిపారు. ఘటనల గురించి అప్పట్లో డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, సెక్యూరిటీ పెంచుతామని ఇప్పటి దాకా అమలు చేయలేదని పేర్కొన్నారు. నెల క్రితం బయటి వ్యక్తులు పర్మనాలజీ పీజీ విద్యార్థిని కాలర్ పట్టుకున్నారని, ప్రస్తుత దాడి ఘటనలోనూ ఆ వ్యక్తుల్లో ఒకరున్నట్లు తెలిపారు. గర్ల్స్ హాస్టల్ వెనుక ప్రహరీ చిన్నదిగా ఉండడంతో బయటి వ్యక్తులు లోనికి ప్రవేశిస్తున్నారని చెప్పారు. అటువైపు సీసీ కెమెరాలు లేకపోవడంతో తరచూ ఈ ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. రిమ్స్ డైరెక్టర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విచారణ కమిటీ సభ్యులు దాడి ఘటనకు సంబంధించిన విషయాలను పక్కనబెట్టి ఇతర విషయాలు అడిగారని ఆరోపించారు. తమవద్ద ఉన్న వీడియోలను ఇస్తామన్నా తీసుకోలేదని వివరించారు.

వైద్యవిద్యార్థులపై కేసు

రిమ్స్ వైద్యవిద్యార్థి కవిరాజ్‌తో పాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ బంధువులను చూడటానికి వెళ్లిన తన భర్త ఈరవేణి శివపై అకారణంగా వైద్యవిద్యార్థులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని ఆరోపిస్తూ అతడి భార్య భావన గురువారం ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

డీఎంఈ ఆదేశాలతో విచారణ



డైరెక్టర్‌ను విచారిస్తున్న కమిటీ సభ్యులు

రిమ్స్ వైద్య విద్యార్థులపై జరిగిన దాడి నిగ్గుతేల్చడానికి విచారణ కమిటీ రంగంలోకి దిగింది. డీఎంఈ ఆదేశాల మేరకు నిజామాబాద్‌కు చెందిన ప్రొఫెసర్లు శివప్రసాద్, వీవీరావు రిమ్స్‌లో శుక్రవారం విచారణ చేపట్టారు. వైద్య కళాశాల వసతిగృహంలోకి బయటి వ్యక్తులు ఎందుకు వచ్చారు.. ఎవరి ప్రమేయంతో వచ్చారు.. ఎందుకు దాడి చేశారనే కోణంలో విచారించారు. అందరితో మాట్లాడి నివేదిక సిద్ధం చేశారు. మొదట రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఆ తర్వాత వైద్యులు, సిబ్బంది, దాడి ఘటనలో గాయాల పాలైన వైద్య విద్యార్థులతో వేర్వేరుగా మాట్లాడారు. నివేదిక తయారు చేసి డీఎంఈకి అందజేయనున్నట్లు వివరించారు.

డైరెక్టర్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విద్యార్థులు

రిమ్స్ డైరెక్టర్‌ను జైసింగ్ రాథోడ్‌ను తొలగించాకే విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ మేడికోలు, జూనియర్ డాక్టర్లు శుక్రవారం సాయంత్రం అతడి దిష్టిబొమ్మ దహనం చేశారు. డైరెక్టర్‌కు వ్యతిరేకంగా నినదించారు. మెడికల్ కళాశాల నుంచి ర్యాలీగా వచ్చి ప్రధాన గేటు వద్ద ధర్నా చేశారు.

మంత్రి యోగమెవరికో !


- కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో అమాత్య ఆశలు
- రేసులో 'గడ్డం' సోదరులు, పీఎస్సార్
- ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు



గడ్డం వినోద్



గడ్డం వివేక్



ప్రేమ్‌సాగర్‌రావు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల్లో 'మంత్రి' పదవి కోసం సీనియర్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మంత్రివర్గ మొదటి విస్తరణలో ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికీ ప్రాతినిధ్యం దక్కలేదు. దీంతో అంతా రెండో విడత విస్తరణపైనే ఆశలు పెట్టుకున్నారు. మరికొద్ది రోజుల్లోనే రెండో విడత కేబినెట్ విస్తరణ జరగనుంది. ఈ క్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరికి వారు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం పలు జిల్లాల నుంచి నలుగురు ఎమ్మెల్యేలను ప్రభుత్వ విప్‌లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విప్ పదవుల్లోనూ ఉమ్మడి జిల్లా నుంచి ఎవరూ లేరు. దీంతో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, ఖానాపూర్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేల్లో కేబినెట్‌తోపాటు ఇతర కీలక పదవుల్లో ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తిగా మారింది. కాంగ్రెస్ పార్టీ నుంచి ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలిచిన వెడ్మ బొజ్జుతోపాటు మరో ముగ్గురు సీనియర్ నాయకులు పోటీలో ఉన్నారు. వీరందరిలో ప్రధానంగా ముగ్గురు సీనియర్ల మధ్యే పోటీ తీవ్రంగా ఉంది.

'గడ్డం' సోదరుల పోటీ..

'గడ్డం' సోదరులు ఇద్దరూ మంత్రి పదవిపై నమ్మకం పెట్టుకున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి గెలిచిన గడ్డం వినోద్, చెన్నూరు నుంచి గెలిచిన వివేక్ ఒకరితో ఒకరు పదవి కోసం పోటీ పడుతున్నారు. ఒక దశలో వివేక్‌కు మొదటి కేబినెట్ విస్తరణలోనే బెర్త్ ఖాయమని ఆయన అనుచరులు చెప్పుకొన్నారు. కానీ.. మంత్రివర్గంలో ఆయన పేరు లేదు. అదే సమయంలో తనకే మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ వినోద్ కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు సోనియా గాంధీని ఢిల్లీకి వెళ్లి కలిసి వచ్చారు. దీంతో ఇద్దరు అన్నదమ్ములు అమాత్య పదవి కోసం పోటీ పడడం కనిపిస్తోంది. ఈ ఇద్దరన్నదమ్ముల్లో ఎవరిని పార్టీ అధిష్ఠానం పరిగణనలోకి తీసుకుంటుందోనని కేడర్‌లో చర్చ జరుగుతోంది.

'పీఎస్సార్'కు ఖర్గే హామీ !

ఉమ్మడి జిల్లాలో సీనియర్ నేతగా ఉన్న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్) మంత్రి పదవి రేసులో ప్రముఖంగా ఉన్నారు. గత ఏప్రిల్‌లో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర సందర్భంగా మంచిర్యాలలో ఏర్పాటు చేసిన 'సత్యాగ్రహ' సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పీఎస్సార్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే, కీలక హోదాలో ఉంటారని హామీ ఇచ్చారు. అయితే తొలివిడతలో ఆయనకు అవకాశం రాలేదు. మరోవైపు మంత్రి పదవులు వరించిన వారి సామాజిక వర్గాలు చూస్తే, వెలమ కోటలో ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి జూపల్లి కృష్ణారావుకు చోటు దక్కింది. ఇక ఎస్సీ కోటాలో భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రి, దామోదర రాజనర్సింహా ఉన్నారు. ఈ క్రమంలో మిగిలిన ఆరు మంత్రి పదవుల్లో భర్తీ చేయాల్సి వస్తే, సామాజిక సమీకరణాలు కీలకంగా మారాయి. పోటీలో ఉన్న వారి సామాజిక కోటా పరిగణనలోకి తీసుకుంటే, ఎవరి అవకాశాలను దెబ్బతీస్తుందోననే ఉత్కంఠ నెలకొంది. కేబినెట్ స్థాయి పదవులతో సమానంగా ఉండే డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్‌తో పదవి దక్కని వారు నిరాశ పడకుండా సర్దుబాటు చేస్తారనే వాదనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి తదుపరి టీంలో ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికి చోటు ఉంటుందో, ఎవరికి నిరాశ కలుగుతుందోనని అధికార పార్టీ వర్గాల్లోనూ, ఇటు ఉమ్మడి జిల్లా ప్రజల్లోనూ ఆసక్తి నెలకొంది. ఎవరికి వారు ఇటు రాష్ట్ర పెద్దలతోపాటు అటు ఢిల్లీలోని పార్టీ పెద్దలను కలుస్తూ మంత్రి పదవి కోసం తమ ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

రైతులకు అందని మద్దతు ధర

ఆదిలాబాద్‌టౌన్: రైతులకు మద్దతు ధర దక్కడం లేదని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు వెళ్లి పత్తి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జూలై, ఆగస్టులో భారీ వర్షాలు కురియడంతో దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. సీసీఐ, ప్రైవేట్ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. పండించిన పంటకు మద్దతు ధర కూడా దక్కక పోవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారని వాపోయారు. ఆయన వెంట రైతు సంఘం నాయకులు వెంకట్‌రెడ్డి, కార్తిక్ రెడ్డి, మహదేవ్, స్వామి తదితరులున్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు



సామాజిక తనిఖీలో వివరాలు వెల్లడిస్తున్న సిబ్బంది

తాంసి: ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే నిధులు రికవరీ చేస్తూ శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో కిషన్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో 2022 నుంచి 2023వరకు చేపట్టిన పనులపై 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను ఎంపీపీ మంజుల అధ్యక్షతన ప్రారంభించారు. 13 పంచాయతీల్లో రూ.1,74,71,150 నిధులతో 98 రకాల పనులు చేపట్టగా, సోషల్ ఆడిట్ బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన వివరాలు ప్రజావేదికలో వెల్లడించారు. గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి మస్టర్లు రికార్డుల్లో సరిగా నమోదు చేయలేదని, ఆడిట్ బృందానికి రికార్డులు ఇవ్వలేదని డీఆర్పీలు వెల్లడించారు. సావర్గాంలో సంతకం లేకుండా 21 మంది బిల్లుల చెల్లింపులు జరిగాయని తెలిపారు. హస్నాపూర్ గ్రామంలో సరైన ఫొటోలు లేకుండా పనులు చేపట్టారని, వడ్డాడిలో 13గొర్రెల షెడ్ల నిర్మాణానికి బిల్లుల ఇవ్వలేదని పేర్కొన్నారు. పొన్నారిలో నూతన జాబ్ కార్డుల కోసం మేట్ డబ్బులు డిమాండ్ చేశారని గ్రామస్తులు గ్రామసభలో ఆరోపించినట్లు వెల్లడించారు. గిరిగాంలో అవెన్యూ ప్లాంటేషన్‌లో 408 మొక్కలు నాటితే 100 మొక్కలే ఉన్నట్లు తెలిపారు. గోట్కూరి గ్రామంలో యంత్రాల ద్వారా పనులు చేపట్టి కూలీల పేరిట బిల్లులు చెల్లించినట్లు పేర్కొన్నారు. బిల్లుల విషయమై కూలీలను గ్రామసభలో అడగగా తాము పనికి వెళ్లకుండానే బిల్లులు వచ్చాయని తెలిపినట్లు వివరించారు. కప్పర్లలో చనిపోయిన వారితో పాటు ఆశ కార్యకర్త పనిచేసినట్లు బిల్లులు చెల్లించినట్లు, తాంసిలో పంచాయతీ కార్మికుడి పేరిట బిల్లుల చెల్లింపు జరిగినట్లు గుర్తించామన్నారు. తాంసి బృహత్ ప్రకృతివనంలో నీళ్లు లేని కారణంగా మొక్కలు ఎండిపోయాయని తెలిపారని ప్రజావేదికలో సభ్యులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో తనిఖీ చేసినప్పుడు పంచాయతీ కార్యదర్శి తనిఖీ ప్రదేశాలకు రాలేదని తెలిపారు. వీటితో మస్టర్లు, రికార్డుల్లో వివరాల నమోదు, రిజిస్టర్ల నిర్వహణ సరిగా లేక నిధులు దుర్వినియోగమైనట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో కిషన్ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన పనులు పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమాలు జరిగినట్లు తేలితే డబ్బులు రికవరీ చేయడంతోపాటు సంబంధిత సిబ్బందికి నోటీసులివ్వాలని అధికారులను ఆదేశించారు. ఏపీడీ కృష్ణారావు, ఎంపీడీవో భూమయ్య, అంబుడ్స్‌మన్ వీణ, ఏవో గంగాధర్, ప్లాంటేషన్ మేనేజర్ సూర్య ప్రకాశ్, ఏపీవో విజయ, ఎస్సార్పీ పాండరంగ్, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



డీఎంకు వినతిపత్రం ఇస్తున్న గోవర్ధన్‌రెడ్డి

ఆదిలాబాద్: జిల్లాలోని మారుమూల గ్రామాలకూ ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి కోరారు. ఆదిలాబాద్ ఆర్టీసీ డీఎం కల్పనను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జైనథ్ మండలం లక్ష్మీపూర్ నుంచి వయా చాంద (టీ) వరకు గతంలో నడిచిన బస్సును ప్రయాణికుల సౌకర్యార్థం పునరుద్ధరించాలని కోరారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన నేపథ్యంలో అందరికీ సేవలందేలా చూడాలన్నారు. ఇందుకు సానుకులంగా స్పందించిన డిపో మేనేజర్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు కొండూరి రవి, చిందం శ్రీధర్ తదితరులున్నారు.

ఉత్తుత్తి నియామకాలు!

తలమడుగు మండలం ఖోడద్ ప్రభుత్వ పాఠశాలలో ఒకరిని అటెండర్‌గా నియమిస్తూ ఓ స్వచ్ఛంద సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ సంస్థ వారు ప్రధానోపాధ్యాయురాలికి ఫోన్ చేసి తమ సంస్థ ద్వారా మీ పాఠశాలకు ఓ అటెండర్‌ను నియమించామని తెలిపారు. దీంతో ప్రధానోపాధ్యాయురాలు స్వచ్ఛంద సంస్థలకు అనుమతి ఇవ్వకూడదని ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయని, తాము ఎవరినీ అనుమతించమని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు తీసుకువస్తే పాఠశాలలో చేర్పించుకుంటామని ఆమె వివరించారు.

ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ నిరుద్యోగి మధ్యవర్తి ద్వారా ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఆ తర్వాత నియామకపత్రం అందుకుని చాంద పాఠశాలకు వెళ్లాడు. నియామకపత్రం చూసిన ప్రధానోపాధ్యాయుడు అతడిని అటెండర్‌గా జాయిన్ చేసుకున్నాడు. దీంతో అతడు నాలుగు రోజులుగా పనిచేస్తున్నాడు. కాగా, తనకు నెలకు రూ.15వేల వేతనం ఇస్తామని స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు తెలిపినట్లు అతడు వివరించాడు.

- నిరుద్యోగులకు స్వచ్ఛంద సంస్థ టోకరా
- ఉద్యోగాలిప్పిస్తామని జోరుగా వసూళ్లు
- అటెండర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు
- చేర్చుకోని ఆయా ప్రధానోపాధ్యాయులు
- గతేడాది కూడా ఇలాంటి మోసాలే
- సంబంధం లేదంటున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: నిరుద్యోగుల అవసరం.. వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఓ స్వచ్ఛంద సంస్థ జిల్లాలో అక్రమ దందాకు తెరలేపింది. అందిన కాడికి దండుకుని నకిలీ నియామక పత్రాలను నిరుద్యోగ యువతకు అందజేసి ఆయా పాఠశాలలకు పంపిస్తోంది. అక్కడ జాయిన్ అయినవారు చివరికి వేతనాలు రాక మోసపోయామని గ్రహిస్తూ బోరుమంటున్నారు. తాజాగా నాలుగు రోజుల క్రితం ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. ఈ ఘటన విద్యాశాఖలో తీవ్ర కలకలం రేపుతోంది. గతేడాది కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. స్వచ్ఛంద సంస్థలను పాఠశాలల్లోకి అనుమతించవద్దని గతంలోనే ఆదేశాలు జారీ చేసినా ఆ స్వచ్ఛంద సంస్థ అక్రమ దందా సాగిస్తోంది.

'కాసు'ల కోసమే..

సదరు స్వచ్ఛంద సంస్థ కాసుల కోసమే ఈ దందాకు తెరలేపినట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ పట్టణంలోని చిల్కూరిలక్ష్మీనగర్‌కు చెందిన ఓ నిరుద్యోగ మహిళను ఖోడద్ పాఠశాలలో అటెండర్‌గా నియమించినట్లు నియామక పత్రాన్ని పంపించారు. రూ.లక్ష వరకు ఆమెను అడిగినట్లు సమాచారం. నెలకు రూ.15వేల వేతనం ఉంటుందని, ఇందులో పీఎఫ్ ఖాతాకు రూ.1,500 జమ కానుండగా, రూ.13,500 వేతనం వస్తుందని నమ్మించారు. ఈనెల 8న ఇలా పలువురిని ఆయా పాఠశాలల్లో నియమించారు. వీరిని 2027 వరకు కొనసాగించనున్నట్లు అగ్రిమెంట్ చేసుకుని ఉత్తర్వులు అందించారు.



స్వచ్ఛంద సంస్థ ఓ నిరుద్యోగికి అందజేసిన అటెండర్ నియామకపత్రం

గతేడాది కూడా ఇలాగే..

గతేడాది కూడా ఇలాంటి ఘటనలే చోటుచేసుకున్నాయి. ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్పీఎల్ పాఠశాలలో విద్యావలంటీర్‌ను నియమించినట్లు నియామక పత్రాన్ని అందజేశారు. నెలపాటు పనిచేసిన ఆ నిరుద్యోగికి వేతనం రాకపోవడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో ఆ సంస్థ ఫేక్ అని తేలడంతో లబోదిబోమన్నాడు. కొంతమంది ఆ సంస్థకు కొంత మొత్తాన్ని ముట్టజెప్పినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థ నకిలీదో.. కాదో అనేది అధికారులు తేల్చాల్సి ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండా నియామకాలు ఎలా చేపడతారని పలువురు చర్చించుకుంటున్నారు.

అక్రమాలకు చెక్ పడేదెప్పుడో..!

అక్రమ దందాకు తెరలేపిన కొన్ని స్వచ్ఛంద సంస్థల ఆగడాలకు చెక్ పడటం లేదు. మోసపోయేవారు ఉంటే.. మోసం చేసేవారికి కొదవ లేదన్న చందంగా పరిస్థితి మారింది. గతేడాది ఓ మాయలేడీ రిమ్స్‌లో ఉద్యోగాలిప్పిస్తామని చాలామంది నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసింది. ఫిర్యాదులు అందుకున్న పోలీసున్నామెను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించిన విషయం తెలిసిందే.

అధికారుల అనుమతి లేకుండానే..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడకు చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు జిల్లాలోని పలు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఫోన్ చేసి పాఠశాలలో ఏమి అవసరాలున్నాయో నెల క్రితం తెలుసుకున్నారు. పలువురు ఉపాధ్యాయులు కంప్యూటర్లు, ఆఫీస్ సబార్డినేటర్లు అవసరమని తెలిపారు. నాలుగు రోజుల కిందట ఆదిలాబాద్ మండలం చాంద పాఠశాలకు స్వచ్ఛంద సంస్థ ద్వారా ఓ అటెండర్‌ను నియమించారు. అలాగే తలమడుగు మండలం ఖోడద్ పాఠశాలకు అటెండర్‌ను పంపుతామని ప్రధానోపాధ్యాయురాలికి ఫోన్ చేయగా, ఆమె నిరాకరించారు. నిబంధనల ప్రకారం ఎవరినైనా పాఠశాలల్లో నియమిస్తే డీఈవో, ఎంఈవో అనుమతి తప్పనిసరి. వారి ఆదేశాల మేరకే ఈ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. అయితే స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు మాత్రం డీఈవో, ఎంఈవో ఎస్ఎంసీ కమిటీ అనుమతి లేకుండా అటెండర్లను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. ఇందుకు 14 పాఠశాలలను ఎంపిక చేసినట్లు సమాచారం. ఇలా 30 మందిని నియమించినట్లు తెలిసింది. కొందరు హెచ్‌ఎంలు ఇలా వచ్చిన వారిని విధుల్లో చేర్పించుకోగా, మరికొందరు నిరాకరించారు.

నా దృష్టికి రాలేదు

స్వచ్ఛంద సంస్థ ద్వారా పాఠశాలల్లో అటెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల నియామకం విషయం నా దృష్టికి రాలేదు. పాఠశాలల్లో వారు చేరినట్లు సమాచారం లేదు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా ఎలాంటి సమాచారం అందలేదు. ఏ స్వచ్ఛంద సంస్థ కూడా నియామకాల కోసం మా నుంచి అనుమతి తీసుకోలేదు.

– ప్రణీత, డీఈవో

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యంతో పోలీసులు

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామ సమీపంలో రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... ముధోల్ ఎడ్‌బిడ్ గ్రామం నుంచి పుస్పూర్ మీదుగా లోకేశ్వరానికి మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన షిరాజ్ బోలేరో వాహనంలో 30క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా సమాచారం మేరకు పట్టుకున్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. షిరాజ్‌పై కేసు నమోదు చేసి పట్టుకున్న బియ్యాన్ని సంబంధిత అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్సై తెలిపాడు.

గుట్కా వేలం

నిర్మల్‌టౌన్: ఈ నెల 23న జిల్లా కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్ కార్యాలయంలో గుట్కా (ఫిల్టర్ టొబాకో) వేలం పాట నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ప్రకటనలో అసిస్టెంట్ కమిషనర్ గోదావరి తెలిపారు. 19 అక్టోబర్ 2023న అక్రమంగా తరలిస్తున్న 150 బస్తాల గుట్కా కంటైనర్‌ను పట్టుకున్నామని, దాని విలువ రూ.10 లక్షల 42వేల31 ఉంటుందని తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనే వారు ఈ నెల 22న సాయంత్రం 5గంటల వరకు రూ.1,04,203 డీడీ తీసుకొని కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు. ఉదయం 11గంటలకు వేలం ప్రారంభమవుతుందన్నారు.

పురుగుల మందుతాగి వృద్ధుడి ఆత్మహత్య



భీమయ్య మృతదేహం

కడెం: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన దేశినేని భీమయ్య(68) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మంచినీళ్ల నర్సయ్య అనే వ్యక్తి భీమయ్యతో గొడవపడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన భీమయ్య గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరులేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు నర్సయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె. రాజు పేర్కొన్నారు.

కడెం ప్రాజెక్ట్‌లో పడి మత్స్యకారుడు మృతి

- అనాథలైన ముగ్గురు పిల్లలు



నరసింహ(ఫైల్)

కడెం: చేపల వేటకెళ్లి ప్రమాదవశాత్తు మత్స్యకారుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన నాగుల నరసింహ (45) తెప్పపై కడెం ప్రాజెక్ట్‌లోకి చేపల వేటకు వెళ్లాడు. వల వేస్తుండగా కాలుకు తట్టుకుని ప్రమాదవశాత్తు ప్రాజెక్ట్‌లో పడిపోయాడు. వల శరీరానికి చుట్టుకుని ఊపిరాడక మృతి చెందినట్లు మత్స్యకారులు భావిస్తున్నారు. స్థానిక మత్స్యకారులు మృతదేహన్ని ప్రాజెక్ట్‌లో నుంచి బయటకు తీసుకువచ్చారు. నరసింహ భార్య ఏడాది క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. ఇప్పుడు నరసింహ మృతితో ఇద్దరు కుమారులు, కూతురు అనాథలుగా మిగిలారు. సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దేవ్ తెలిపారు.

అందని ‘ఉపాధి’ కూలి

- ఆర్థిక ఇబ్బందుల్లో కూలీలు
- నెలనెలా చెల్లించాలని డిమాండ్



ఆదిలాబాద్‌రూరల్: ఉపాధిహామీ కూలీలకు సకాలంలో కూలి అందడంలేదు. మూడు నెలలుగా కూలి చెల్లించకపోవడంతో కుటుంబ పోషణకు నానా తంటాలు పడుతున్నారు. జిల్లాలో 1,69,532 జాబ్‌కార్డులుండగా 3,41,300 మంది కూలీలున్నారు. ఇందులో 2,13,296 మంది కూలీ పనులకు వెళ్తున్నారు. ప్రభుత్వం ఒక్కొక్కరికి పనిని బట్టి రూ.272 కూలి చెల్లిస్తోంది.

49.07 లక్షల పని దినాల లక్ష్యం

జిల్లాలో 18 మండలాలుండగా 17 మండలాల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 2,13,296 మంది కూలీలలకు 49.07 లక్షల పని దినాలను కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. డిసెంబర్ వరకు 31.89 లక్షల పని దినాలు కల్పించాల్సి ఉండగా 30.91 లక్షల పని దినాలు కల్పించారు. 696 కుటుంబాలకు ఇప్పటివరకు 100 రోజులు పని కల్పించారు. కూలీలు ఇప్పటివరకు రూ.65.31 కోట్ల విలువ చేసే పనులు చేశారు. మెటీరియల్ కోసం రూ.50.97 కోట్ల పనులు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఐదు వారాల డబ్బులు రావాలి



గతంలో ఉపాధి హామీ కూలీ పనులకు వెళ్తే వారానికి ఒకసారి కూలీ డబ్బులు వచ్చేవి. ఈ ఏడాది మాత్రం మూడేసి నెలల పాటు కూలి డబ్బులు రావడం లేదు. ఇప్పటికి ఐదు వారాలకు సంబంధించిన కూలీ డబ్బులు రావాల్సి ఉంది. సకాలంలో కూలీ డబ్బులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం

– బహదూర్ వెంకటి, కూలీ

సకాలంలో జమ చేయాలి



గత కొన్నేళ్ల నుంచి ఉపాధి హామీ కూలీ పనులకు వెళ్తున్నా. గత కొన్ని నెలల నుంచి కూలి డబ్బులు సకాలంలో అందడం లేదు. ప్రభుత్వం, అధికారులు డబ్బులను సకాలంలో జమా చేసేలా చూడాలి. కూలి డబ్బులు సకాలంలో వస్తే తాము ఇబ్బంది పడకుండా ఉంటుంది. వారానికి ఒకసారి డబ్బులు ఇస్తే బాగుంటుంది.

– అల్లూరి వెంకటి, కూలీ

నవంబర్ 6 వరకు వచ్చాయి



ఉపాధి హామీ కూలీలకు సంబంధించిన డబ్బులు 6 నవంబర్ 2023 వరకు జమయ్యాయి. కేవలం 35 రోజులకు సంబంధించిన కూలీ డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయి. అవి కూడా త్వరలో కూలీల ఖాతాలో జమవుతాయి. సకాలంలో కూలి డబ్బులు జమయ్యేలా చూస్తాం. కూలీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– కిషన్, డీఆర్డీవో

ట్రిపుల్‌ఐటీలో ఆటా వేడుకలు





ట్రిపుల్‌ఐటీలో ఆటా బృందం సభ్యులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీని ఆటా(అమెరికా తెలుగు అసోసియేషన్ ఎడ్యుకేషన్ ప్రోగాం) బృందం శుక్రవారం సందర్శించింది. విద్యార్థులతో సభ్యులు కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆటా వేడుకల ప్రెసిడెంట్ జయంత్‌చల్లా మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడంలోనే ఆనందం ఉందన్నారు. బాసర ట్రిపుల్‌ఐటీలో వేడుకలు జరుపుకోవడం గొప్ప అవకాశంగా భావిస్తునానమని తెలిపారు. అమెరికాలాంటి దేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు తమవంతు సహకారాం అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులతో కలిసి వీఐపీ గెస్ట్‌హౌస్ నుంచి ఏకోపార్క్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ డెరెక్టర్ సతీశ్‌కుమార్, ఆటా కార్యదర్శి సతీశ్‌రెడ్డి, కోశాధికారి వేణుగోపాల్‌సంకినేని, కోఆర్డినేటర్ రవీందర్‌గూడురు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- పూర్తిగా కాలిపోయిన వంట సామగ్రి
- రూ.2లక్షల ఆస్తినష్టం

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామంలో రెండు ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయ్యాయి. ఆర్‌ఐ బాలకిషాన్ వివరాల ప్రకారం... ఎర్రవ్వ, సుజాతలకు చెందిన పెంకుటిళ్లు శుక్రవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో నిప్పంటుకుంది. గమనించిన స్థానికులు మంటలు ఆర్పివేశారు. అప్పటికే ఇళ్లల్లోని సామగ్రి పూర్తిగా కాలిబూడిదైంది. దీంతో సుమారుగా రూ.2లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్‌ఐ సంఘటనా స్థలానికి చేరుకుని వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బోగ్గుట నర్సయ్య, కథం శ్రీనివాస్, వీడీసీ అసిబోద్దిన్ పటేల్ సమక్షంలో పంచనామా నిర్వహించారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేసి నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ధర్మోరలో పూర్తిగా కాలిపోయిన ఇల్లు

ఖతార్‌లో టీజీఎస్ ఆధ్వర్యంలో మహారక్తదానం



రక్తదానం చేస్తున్న తెలంగాణవాసులు

నర్సాపూర్(జి): తెలంగాణ గల్ఫ్ సమితి (టీజీఎస్) ఆధ్వర్యంలో దోహ ఖతార్ దేశంలో శుక్రవారం తెలంగాణలోని కరీంనగర్, నిజామాబాద్, కోరుట్ల, జగిత్యాల, నిర్మల్ ప్రాంతాలకు చెందిన 104మంది తెలంగాణ వాసులు మహా రక్తదాన కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేసినట్లు నర్సాపూర్(జి) గ్రామ వాసి పాలకుర్తి మోహన్‌రావు పేర్కొన్నారు. పిలిచిన వెంటనే మేమున్నాం అంటూ ముందుకొచ్చి రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ టీజీఎస్ అధ్యక్షుడు మధు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ గల్ఫ్ సమితి అధ్యక్షుడు మధు, ఉపాధ్యక్షుడు రాజన్న, ఫిషర్ మెన్ హెడ్ శంకర్ గౌడ్, లేబర్ వెల్ఫేర్ మను, గడ్డి రాజు, సంధ్యా రాణి, ప్రియాంక పాల్గొన్నారు.

వైకల్యాన్ని అధిగమించాలి



జెండా ఊపి ఆటల పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్



దివ్యాంగులతో క్యారం ఆడుతున్న కలెక్టర్

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: వైకల్యం ఉందని కుంగిపోకుండా.. మానసిక స్థైర్యంతో దానిని అధిగమించాలని, అన్నిరంగాల్లో రాణించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జిల్లా మహిళా, శిశు దివ్యాంగుల, వయోవద్ధుల, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 10 నుంచి 16 ఏళ్ల లోపు దివ్యాంఉగలకు శుక్రవారం ఆటల పోటీలు నిర్వహించారు. కలెక్టర్ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన దివ్యాంగులతో కలెక్టర్ కాసేపు క్యారం, చెస్ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు పరుగు పందెం, షాట్‌పుట్, క్యారమ్, చెస్, జావెలిన్ త్రో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రమేశ్, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు సట్టి సాయన్న, ఇసాక్ అలీ, సాకొపెల్లి సురేందర్, క్రాంతి కుమార్, మహేశ్, దివ్యాంగులు శ్రీనివాస్, నర్సయ్య, యాదగిరి, రమేశ్‌రెడ్డి, భగవాన్, పుష్ప, సత్యనారాయణ పాల్గొన్నారు.

గణిత ఫోరం ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పరీక్ష



ప్రశ్నాపత్రాలు విడుదల చేస్తున్న డీఈవో

నిర్మల్ రూరల్: తెలంగాణ గణితఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు శ్రీనివాస రామానుజన్ మండల స్థాయి ప్రతిభాపాటవ పోటీలు శుక్రవారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో డీఈవో రవీందర్‌రెడ్డి, జిల్లా పరీక్షల అధికారి సిద్ధ పద్మ పరీక్ష పత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇలాంటి పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. గణితంలో ప్రతిభ ఉన్న విద్యార్థులు అన్ని పోటీపరీక్షల్లో రాణిస్తారన్నారు. గణితంపై శ్రద్ధ, ఏకాగ్రతతో ఉండి విద్యార్థులు పోటీ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు చట్ల శ్రీనివాస్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం లక్ష్మణ్, ఉపాధ్యాయులు అశోక్, నాగుల రవిగౌడ్, విజయభాస్కర్ మునీందర్‌రాజు పాల్గొన్నారు.

ఇథనల్ కర్మాగారాన్ని తరలించాలని ఆందోళన



రోడ్డుపై బైఠాయించిన వారితో మాట్లాడుతున్న పోలీసులు

దిలావర్‌పూర్: మండల కేంద్రమైన దిలావర్‌పూర్ గ్రామ సమీపంలో నిర్మిస్తున్న ఇథనాల్ కర్మాగారాన్ని తరలించాలని శుక్రవారం దిలావర్‌పూర్ గ్రామస్తులు నిర్మల్–భైంసా రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో పలు కుల సంఘాలు, గ్రామస్తులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఇథనాల్ కర్మాగార నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని నినాదాలు చేశారు. దాదాపుగా గంటకుపైగా రోడ్డుపై బైఠాయించి కర్మాగారానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో దిలావర్‌పూర్ ఎస్సై యాసిర్ అరాఫత్, నర్సాపూర్ ఎస్సైతో పాటు పలువురు పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని రాస్తారోకోను విరమింపజేశారు. ఇందులో స్థానిక నాయకులు, ఇథనాల్ కర్మాగార వ్యతిరేక జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.

కొత్త ప్రభుత్వంపై ఆశలు

- వేతనం కోసం విలీన వీఆర్‌ఏల తండ్లాట
- ఆరు నెలలుగా అందని జీతాలు



సమ్మెలో పాల్గొన్న వీఆర్‌ఏలు(ఫైల్)

కోటపల్లి: ప్రభుత్వానికి ప్రజలకు మధ్యలో అనుసంధానంగా వ్యవహరించిన వీఆర్‌ఏలను పదోన్నతుల ద్వారా ప్రభుత్వం వివిధ శాఖల్లో సర్దుబాటు చేసింది. అయితే అప్పటి నుంచి వీరికి జీతాలు చెల్లించడంలేదు. దీంతో వారు అప్పటి నుంచి ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి తమ సమస్యను పరిష్కరిస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమైన నిర్లక్ష్యానికి గురైన వీఆర్‌ఏలు చాలా తక్కువ వేతనం నుంచి పనిచేస్తుండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపాయే నాటికి రూ.6వేల వేతనం అందుకుంటున్నారు. తమ బతుకులు మార్చాలని అనేక పోరాటాలు చేసిన వీఆర్‌ఏలకు తెలంగాణ ప్రభుత్వం వచ్చాక వేతనాన్ని రూ.10,500వేలకు పెంచింది. 2016, 2020 సంవత్సరాల్లో ఆసెంబ్లీలో అప్పటి సీఎం వీఆర్‌ఏలకు పదోన్నతి కల్పిస్తామని, వారి వారసులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చాడు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన రెవెన్యూ చట్టంతో ప్రమోషన్ ఇచ్చేందుకు అవకాశం లేని పరిస్థితి ఏర్పడింది. ఇచ్చిన హామీ నెరవేరకపోవడంతో గత ఏడాది వీఆర్‌ఏలు సమ్మె బాట పట్టి 86 రోజులు విధులకు దూరంగా ఉన్నారు. సమ్మె విరమించి చర్చలకు వస్తేనే వీఆర్‌ఏల గురించి ఆలోచిస్తామని గత ప్రభుత్వం తెలుపడంతో చర్చలకు వెళ్లారు. వీఆర్‌ఏల ప్రతినిధులతో చర్చలు జరిపి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జీవో నంబర్ 81 ప్రకారం వారిని మున్సిపాలిటీ, ఇరిగేషన్, మిషన్‌భగీరథ, రెవెన్యూ ఇలా వివిధ శాఖల్లో పదోన్నతులపై నియమిస్తూ 10.08.2023న వారికి అపాయింట్‌మెంట్ లెటర్లను అందజేసింది. అప్పటి వరకు రూ.10,500 వేతనం అందుకున్న వీఆర్‌ఏలను వివిధ శాఖల్లో పదోన్నతులపై సర్దుబాటు చేసింది. అయితే వారికి నేటికి జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. కొత్త ప్రభుత్వమైనా వేతనాలు చెల్లించాలని వేడుకుంటున్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వీఆర్‌ఏలు....	
ఆదిలాబాద్	327
నిర్మల్	728
మంచిర్యాల	523
కొమురంభీం	374
మొత్తం	1925

ఉమ్మడి జిల్లాలో 1925 మంది...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1925 మంది వీఆర్‌ఏలను పదోన్నతులు ఇచ్చి మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, మిషన్ భగీరథ తదితర శాఖల్లో సర్దుబాటు చేయగా కొందరిని ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాకు పంపించారు. వీరిలో 10వ తరగతి వరకు చదివిన వారిని ఆఫీస్ సబార్డినేట్‌గా, ఇంటర్ చదివిన వారిని రికార్డు ఆసిస్టెంట్‌గా, డిగ్రీ పూర్తి చేసిన వారిని జూనియర్ ఆసిస్టెంట్‌గా పదోన్నతులు కల్పించారు. అప్పటి నుంచి ఆయా శాఖల్లో పనిచేస్తున్న వీరు తాత్కాలిక రిజిస్టర్‌లోనే ప్రతిరోజు సంతకాలు చేస్తున్నారు. జీతాలు రాకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం గుర్తింపు కార్డులు కూడా ఇవ్వలేదని వాపోతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం...

నేను ప్రస్తుతం మున్సిపాలిటీ వార్డు అధికారిగా పనిచేస్తున్నాను. పదోన్నతిపై మున్సిపాలిటీ వార్డు అధికారిగా విధుల్లో చేరిన నాటి నుంచి ఇప్పటి వరకు జీతం రాలేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాను. కుటుంబాన్ని పోషించడానికి అప్పులు చేయాల్సి వస్తుంది.

– దుర్గం శ్రీనివాస్, వార్డు అధికారి

ఇల్లు గడవడం కష్టంగా ఉంది...

నాలుగు నెలలుగా జీతం రాకపోవడంతో ఇల్లు గడవడం కష్టంగా ఉంది. విధుల్లో చేరిన నుంచి ప్రతిరోజు విధుల నిర్వహణకు వస్తున్నాం. ప్రభుత్వం మాపై దయ చూపి గుర్తింపు కార్డులు అందజేసి జీతాలు చెల్లించాలి.

– సుధాకర్, మిషన్‌భగీరథ హెల్పర్

ఉపాధ్యాయుడి వెకిలిచేష్టలు.. విద్యార్థుల ఆందోళన

- తరగతి గదులు విడిచి పాఠశాల ఆవరణలో నిరసన



పాఠశాల ఆవరణలో విద్యార్థులు

నేరడిగొండ: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి వారి భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన ఓ ఉపాధ్యాయుడు వెకిలిచేష్టలకు పాల్పడుతున్నాడని నేరడిగొండ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం తరగతి గదులను విడిచి పాఠశాల ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. కొంతకాలంగా సీనియర్ ఉపాధ్యాయుడినంటూ పదో తరగతి పరీక్షలు నా చేతిలోనే ఉంటాయని విద్యార్థులను అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా విద్యార్థినిలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు వారు కంటతడి పెట్టారు. విషయం తెలుసుకున్న మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఏలేటి మహేందర్‌రెడ్డి పాఠశాలకు చేరుకొని విద్యార్థులకు నచ్చజెప్పాడు. దీంతో వారు అక్కడి నుంచి తరగతి గదుల్లోకి వెళ్లిపోయారు. అలాగే పాఠశాలలో మధ్యాహ్న భోజనం సైతం సరిగ్గా అందించడం లేదని విద్యార్థులు తెలిపారు. ఈ విషయాలపై ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మను వివరణ కోరగా ఈ విషయాలు తన దృష్టికి రాలేదని తెలిపారు. ఎంఈఓ భూమారెడ్డిని వివరణ కోరగా రెండు రోజుల నుంచి సెలవులో ఉన్నానని, పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య విభేదాల కారణంగా విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నలుగురు గంజాయి విక్రేతల రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డ నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఠాకూర్ హోటల్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో వీరిపై అనుమానం రావడంతో ఎస్సై నవీన్‌గౌడ్ తనిఖీలు చేపట్టగా వీరి వద్ద 400గ్రాముల గంజాయి లభించినట్లు పేర్కొన్నారు. వీటి విలువ రూ.4వేల వరకు ఉంటుందని తెలిపారు. వడ్డెర కాలనీకి చెందిన షేక్ బిలాల్, డాల్డా కంపెనీ ప్రాంతానికి చెందిన షేక్ షోహెబ్, రిక్షా కాలనీకి చెందిన సయ్యద్ ముష్రఫ్, కాంబ్లే ముకేష్‌లను రిమాండ్ చేసినట్లు వివరించారు.

కోటి గౌరమ్మ మహాపూజకు జిల్లా కేంద్రం గౌరమ్మలు



గౌరమ్మలతో మహిళలు



గౌరమ్మలు తయారు చేస్తున్న మహిళలు

ఆదిలాబాద్: నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండల కేంద్రంలో ఈనెల 28వ తేదీన కోటి గౌరమ్మ మహాపూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి కాలనీలోని శ్రీరేణుక మాత దేవాలయంలో శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధల నడుమ గౌరమ్మలను తయారు చేశారు. ఆలయంలో పూజలు చేసి అమ్మవారిని కొలిచారు. మహిళలు మాట్లాడుతూ బాల్కొండలో శ్రీ నారాయణ స్వామి ఆధ్వర్యంలో కోటి గౌరమ్మ మహా పూజోత్సవ కార్యక్రమం జరగనుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లా కేంద్రం నుంచి గౌరమ్మలను పంపుతున్నట్లు తెలిపారు.